

కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న డీసీసీబీ మాజీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి



బీఆర్ఎస్ కార్యకర్తలతో మాట్లాడుతున్న కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్



కామారెడ్డిలో బారులు తీరిన ముస్లిం మహిళా ఓటర్లు



లింగారెడ్డిపేట్ పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

# ఓటెత్తారు..

## జిల్లాలో పోలింగ్ ప్రశాంతం

- అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు
- ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు



జనగామలో ఓటర్లను ఆటోలో తరలిస్తున్న దృశ్యం



కామారెడ్డిలో బారులు తీరిన ఓటర్లు



కామారెడ్డిలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మే13: జహీరాబాద్ లోక్ సభ స్థానానికి జిల్లాలో సోమవారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. జనం ఉదయం నుంచే ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటేశారు. దీంతో బూత్‌ల వద్ద భారీ క్యూ లైన్లు కనిపించాయి. వృద్ధులు, దివ్యాంగులకు బూత్‌ల వద్ద ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. ఓటరు జాబితాలో కొత్తగా పేర్లు నమోదు చేసుకున్న యువత మొదటిసారి ఓటేశాక సెల్ఫీలతో సందడి చేశారు. వివిధ పార్టీల ఆధ్వర్యంలో ఓటర్లను ప్రత్యేకంగా ఆటోల్లో పోలింగ్ కేంద్రాలకు తరలించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఓటర్లలో ఉత్సాహం నింపేందుకు ఎన్నికల సంఘం పలుచోట్ల అందంగా ముస్తాబు చేసిన ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది.

జిల్లాకేంద్రంలో ట్రాన్స్‌జెండర్లు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ యాడారం, షేర్ బీబీపేట్, తుజాల్‌పూర్, జనగామ, ఉప్పర్‌పల్లి, దోమకొండలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సరళి గురించి కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. బీబీపేట్ మండలంలోని జనగామ గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త తిమ్మయ్య గారి సుభాష్‌రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. భిక్కనూరు మండలం బస్వాపూర్‌లోని పోలింగ్ కేంద్రాన్ని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ సందర్శించారు. పోలింగ్ జరుగుతున్న సరళి, ఓటింగ్ శాతాన్ని ఆయన పరిశీలించారు. దోమకొండ మండలం ముత్యంపేటలో బీజేపీ కార్యకర్తలను ఎస్సై గణేశ్ లాఠీతో కొట్టగా గ్రామస్తులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలింగ్ స్టేషన్ సమీపంలో ఎక్కువ మంది గుమిగూడడంతోపాటు ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ పార్టీకి సంబంధించిన స్లిప్‌లను చూపడంతోనే అలా చేయాల్సి వచ్చిందని ఎస్సై గణేశ్ వివరణ ఇచ్చారు. ఇదిలా ఉండగా ఎస్సైపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు.

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఉదయం 5 గంటలకు ఎన్నికల అధికారులు వివిధ పార్టీల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించిన అనంతరం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించారు. 8గంటలకు ఊపందుకున్న ఓటింగ్ మధ్యాహ్నం మందకొడిగా సాగింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటింగ్ సరళిని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మన్నె ప్రభాకర్ పరిశీలించారు.

సాయంత్రం 5 గంటలకు 74.74 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. 6 గంటలకు ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను సీజ్ చేసి ఎల్లారెడ్డిలోని జీవదాన్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. బిచ్కుంద మండల కేంద్రంలో రాత్రి కురిసిన వర్షానికి పలుచోట్ల పోలింగ్‌కేంద్రాల చుట్టూ నీరు చేరడంతో ఓటర్లు కొంత ఇబ్బంది పడ్డారు. మండల కేంద్రంలో 67.06 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు

గాంధారి మండలకేంద్రంలోని పోలింగ్ సరళిని బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ పరిశీలించారు. పెద్ద కొడప్‌గల్ మండలంలో 75.04 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్, కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్, నస్రుల్లాబాద్, కోటగిరి, రుద్రూర్, చందూర్, మోస్రా, వర్ని, బాన్సువాడ తదితర మండలాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి సందర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులతో కలిసి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో 73.99 శాతం పోలింగ్ జరిగినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాథోడ్ రమేశ్ తెలిపారు. కోనా బాన్సువాడ పోలింగ్ కేంద్రాన్ని బాన్సువాడ ఆర్డీవో రాథోడ్ రమేశ్ సందర్శించారు.

### బీఆర్ఎస్‌కు భారీ మెజారిటీ

**-మాజీ స్పీకర్ పోచారం**

పోచారం గ్రామంలో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు వేసే ఓటు తీర్పుతో పాలించే నాయకులు, ప్రభుతాన్ని ఎన్నుకోవచ్చని అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీని ప్రజలు అందించనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ భారీ మెజార్టీతో గెలవబోతున్నారని అన్నారు.

### అనిల్‌కుమార్‌గెలుపు ఖాయం

**-ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల**

ఎల్లారెడ్డి నియోజక వర్గంలో బీఆర్ఎస్‌కు అత్యధిక ఓట్లు వస్తాయని, గాలి అనిల్‌కుమార్ గెలుపు ఖాయమని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ధీమా వ్యక్తం చేశారు. నాలుగు నెలల కాంగ్రెస్ పాలనకు ఈ ఎన్నికలు రెఫరెండమని అన్నారు. స్వల్ప వ్యవధిలోనే రేవంత్ పాలనపై ప్రజలు విరక్తి చెందారని, ఆ పార్టీకి వచ్చే ఓట్లే ఈ విషయాన్ని స్పష్టం చేస్తాయని అన్నారు. లింగంపేట మండలంలోని స్వగ్రామం నల్లమడుగులో ఓటు వేసిన అనంతరం మాట్లాడారు. హామీలతో మోసం చేసిన కాంగ్రెస్‌కు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పనున్నారని అన్నారు.

### ఓటుహక్కును వినియోగించుకున్న ప్రముఖులు

జిల్లాలోని ప్రముఖులు స్వగ్రామాల్లో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్, కుటుంబ సభ్యులు డోంగ్లీ మండలం సిర్పూర్ గ్రామంలో ఓటు వేశారు. బిచ్కుందలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, మఠాధిపతి సోమాయప్ప తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా కేంద్రంలో ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ షబ్బీర్ అలీ వడ్డెర కాలనీలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ జిల్లా పరిషత్ కార్యాలయంలోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎస్పీ సింధుశర్మ అశోక్‌నగర్‌లోని పంచాయతీరాజ్ కార్యాలయంలో, అదనపు కలెక్టర్ చంద్రమోహన్ డ్రైవర్స్ కాలనీలోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఓటు వేశారు. అనంతరం గ్రామంలో ఓటింగ్ సరళి వివరాలను బీఆర్ఎస్ నాయకులును అడిగి తెలుసుకున్నారు.



కామారెడ్డిలో ఓటు వేసిన ఎస్పీ సింధుశర్మ



వెల్లుట్లపేటలో ఓటు వేసిన 80 ఏండ్ల వృద్ధురాలు



ఓటు హక్కు వినియోగించుకున్న బిచ్కుంద మఠాధిపతి బండాయప్ప



నాగిరెడ్డి పేట మండలం ఆత్మాకూర్‌లో ఓటు వేసిన జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి కుటుంబం సభ్యులు



కామారెడ్డిలో ఓటు వేసేందుకు వచ్చిన ట్రాన్స్‌జెండర్లు



బిచ్కుందలో బారులుతీరిన ఓటర్లు



కోనాపూర్‌లో చంటి పిల్లతో ఓటు వేసేందుకు వచ్చిన మహిళ



హస్గుల్ గ్రామంలో ఓటు వేసేందుకు వచ్చిన 105 ఏండ్ల వృద్ధుడు అజీజ్



ఎల్లారెడ్డి జడ్పీజీహెచ్ఎస్ పోలింగ్ కేంద్రంలో విధుల్లో ఆరోగ్య సిబ్బంది



ఎల్లారెడ్డిలో దివ్యాంగుడిని ఎత్తుకొని తీసుకొస్తున్న సహాయకుడు





కోనాపూర్‌లో ఓటు వేసేందుకు వచ్చిన మహిళా ఓటర్లు



మద్నూర్‌లో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు



కామారెడ్డిలో ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ కేంద్రం



ముత్యంపేటలో పోలీసులు, గ్రామస్తుల వాగ్వాదం





కామారెడ్డిలో మొదటిసారి ఓటు వేసిన అనంతరం సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగుతున్న యువతులు





ఎల్లారెడ్డిలో ఓటు హక్కు వినియోగించుకున్న రంగారెడ్డి జిల్లా స్పెషల్ జడ్జి సంతోష్‌కుమార్ దంపతులు



భిక్కనూరు మండలం బస్వాపూర్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన గాలి అనిల్ కుమార్



బాన్సువాడలో మొదటి సారి ఓటు హక్కును వినియెగించుకున్న యువతులు

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

RECRUITMENT

★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు

**జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు**



ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు

కామారెడ్డి, మే 13 : గత యాసంగితో పోలిస్తే ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామని జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్‌బాబు తెలిపారు. టేక్రియాల్‌లో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాన్ని పౌర సరఫరాల జిల్లా మేనేజర్ నిత్యానందంతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో ఇప్పటి వరకు 41,309 మంది రైతుల నుంచి రూ.518 కోట్ల విలువైన 2 లక్షల 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. అకాల వర్షాలతో తల్లడిల్లుతున్న రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా కొనుగోలు కేంద్రాలకు వచ్చి న ధాన్యాన్ని వెనువెంటనే తూకంవేసి రైస్ మిల్లులకు తరలించాలని, మిల్లర్లు కూడా ధాన్యాన్ని త్వరగా అన్‌లోడ్ చేసి ట్రక్ షీట్ జారీ చేయాలని ఆదేశించారు. కేంద్రంలో తూకం వేసి ఉం చిన ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలన్నారు.

## పాముకాటుతో వృద్ధురాలు మృతి

నాగిరెడ్డిపేట్, మే 13: మండలంలోని కన్నారెడ్డి గ్రామానికి చెందిన దీవెన (64) పాముకాటుతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. దీవెన ఆదివారం రాత్రి పూరిగుడిసెలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఎడమచేతిపై పాము కాటువేయడంతో మంటగా ఉందంటూ లేచింది. చేతిపై రెండు గాట్లు కనిపించడంతో దవాఖానకు తరలించే ప్రయత్నం చేస్తుండగానే దీవెన మృతిచెందింది. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

# ఉద్యోగం పేరిట మోసం

- రూ. 6లక్షలు తీసుకొని నకిలీ నియామక పత్రాలు ఇచ్చిన నిందితులు
- లింగంపేట్‌కు చెందిన యువకుడి ఆత్మహత్య



ప్రవీణ్‌కుమార్



నకిలీ నియామకపత్రం

ఎల్లారెడ్డి రూరల్, మే 13: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బులు తీసుకొని మోసం చేయడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన లింగంపేట్ మండలకేంద్రంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట్‌కు చెందిన కుమ్మరి ప్రవీణ్‌కుమార్ (28)కు తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన ఆరిఫ్‌తో పరిచయడం ఏర్పడింది. ఈ క్రమంలో తనకు ఉద్యోగం కావాలని ఆరిఫ్‌ను కోరగా, డబ్బులిస్తే ఇప్పిస్తానన్నాడు. 2019లో ఉద్యోగం కోసం ఆరిఫ్‌కు రూ. 2లక్షలు ఇవ్వడంతో నిజామాబాద్‌కు చెందిన రామకృష్ణారెడ్డి అలియాస్ ఆర్కేరెడ్డిని పరిచయం చేశాడు. రామకృష్ణారెడ్డికి సైతం ప్రవీణ్ విడుతల వారీగా రూ. 6లక్షలు చెల్లించాడు. డబ్బులిచ్చి ఏండ్లు గడుస్తుండడంతో ఉద్యోగం కోసం ఆరిఫ్, రామకృష్ణారెడ్డిపై ఒత్తిడి చేశాడు. దీంతో వారు సంగారెడ్డిలో ఉద్యోగం వచ్చిందని చెప్పి ప్రవీణ్‌కు నియామకపత్రాన్ని అందించారు. వాటిని అక్కడి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి చూపించగా, అవి నకిలీవని అధికారులు వెల్లడించారు. దీంతో ఇంటికి తిరిగివచ్చిన ప్రవీణ్‌కుమార్.. తనకు ఉద్యోగం అక్కరలేదని, తన డబ్బులు తిరిగి ఇచ్చేయాలని ఆరిఫ్‌ను అడిగినా స్పందించలేదు. ఈ క్రమంలో డబ్బులు వృథా చేశావంటూ కుటుంబ సభ్యులు ప్రవీణ్‌ను తీవ్రంగా మందలించారు. దీంతో మనస్తాపం చెంది సోమవారం లింగంపేట్ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఉద్యోగం పేరిటి మోసం చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.